గ్రంథ నిలయం
3935
శ్రీకాకుళం

# కుక్కపిల్ల

ఒక మంచి కుటుంబంలో వుండే మేలైన జాతి శునక కుమారుడను నేను. ఈ ఇంట్లో డిగ్రీ ఉండేది ముగ్గురికి మాత్రమే. మా ఇంటి యజమాని రెడ్డిగారు ఒక పోస్టుగ్రాడ్యుయేట్ మాత్రమే కాదు, బి.ఎల్. డిగ్రీ కూడా సంపాదించిన ఒక పెద్ద పోలీసు అధికారి. (రెండు డిగ్రీలు పొందిన తరువాత సంపాదించిన బి.ఎల్. డిగ్రీని నేను థర్డ్ డిగ్రీ అని విశేషించి చెప్పడం లేదు). వారి ధర్మపత్ని వారికంటే ఏమాత్రమూ తక్కువ కాదు, అంటే, ఆమె కూడా ఒక ఎమ్.ఏ. డిగ్రీ సంపాదించి, ఊరికే ఇంట్లో కూర్చుంటుదన్నమాట. వారి సుపుత్రుడు ఇప్పుడిప్పుడే ప్రథమ డిగ్రీ పొందడానికి కాలేజీలో చదువుతున్నాడు. ఇక కుమార్తె ప్రీడిగ్రీయో, ఇంటర్‌మీడియట్టో చదువుతున్నట్లుంది. అటువంటప్పుడు డిగ్రీ ఉన్న మూడవ వ్యక్తి ఎవరు? అది నేనే అని వేరే చెప్పనక్కరలేదు. నా డిగ్రీ గురించి మామూలుగా ప్రపంచమంతా చెప్పేది ''పెడిగ్రీ'' అని గదా! ఈ ప్రపంచంలో అన్ని విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వాలు, ఇతర సంస్థలు గుర్తించిన ఏకైక డిగ్రీ నాకే వుందని చాలా గర్వంగా వుంది.

నా పూర్వజులు నిజమైన ఆర్య వంశానికి చెందిన జర్మనీ దేశస్థులు. ఆర్యవంశ మేధా సిద్ధాంతాన్ని గురించి, ది గ్రేట్ హిట్లర్ కంటె చాలా ముందే, మా ముత్తాతలు, ముత్తవ్వలు అహోరాత్రులు అరిచేవారు. అందుకే వేరే మామూలు కుక్కలంటే నాకు ఒకరకంగా జుగుప్సగా వుందని చెబితే, అది, నా అహంకారం వల్లనే అని, మామూలు బుద్ధున్నవారు మాత్రం అనుకోలేరు. దానికి అసాధారణ మేధాసంపత్తి కావాలి.

నా యజమాని రెడ్డిగారికి నేనంటే ఎంతో ఇష్టం, అభిమానం కూడా. నా చిన్నప్పటి నుంచీ నాకు కావలసిన పాలు, మందులు, గుడ్లూ ఇప్పించడమూ, నన్ను చాలా శుభ్రంగా వుంచడమే కాకుండా పోలీసు డాగ్‌స్క్వాడ్ సిబ్బందితో నాకు స్పెషల్ ట్రైనింగ్ కూడా ఇప్పించారు. రెండు, మూడు పర్యాయాలు డాగ్‌స్క్వాడ్ ట్రైనింగు సెంటర్‌కు కూడా నన్ను తీసుకెళ్లారు. రెడ్డిగారు ఎక్కడకు వెళ్లినా పోలీసు సిబ్బంది వెంటనే లేచి సెల్యూట్ చేయడం నేను చాలాసార్లు గమనించాను. కానీ అంత పెద్ద

పోలీసు అధికారి గారి ఏకైక శునకమైన నన్ను చూసి ఆ డాగ్‌స్క్వాడ్ కుక్కలు సెల్యూట్ చేయలేదు. సరే; పోనీయండి, కనీసం అటెన్షన్‌లో కూడా నిలబడలేదు. పైగా వాటిలో కొన్ని కుక్కలు నా భాషలో నన్ను అసభ్యంగా తిట్టాయి. ''సరయిన కుక్కకు పుట్టినవాడవయితే దగ్గరకురా, నీ గొంతు కొరికి చీల్చేస్తాం'' అని నన్ను బెదిరించాయి కూడా. పాపం మా యజమానియైన రెడ్డిగారికి ఇదేమైనా తెలుస్తుందా! హిజ్ మాస్టర్స్ వాయిస్ వారి ప్రకటన చిత్రంలో గ్రామఫోనుకు ముందు ఎంతో ఓపిగ్గా కూర్చున్న నాలాంటి శునకాన్ని మీరు గమనించే వుంటారు. మాకు మా యజమాని చేసే శబ్దాలు మాత్రమే కాదు, వేరే మనుష్యులు చెప్పే చాలా విషయాలు కూడా అర్థమవుతాయి. కాని, మేము చెప్పేదేదీ ఈ మనుష్యులకు అర్థం కావటం లేదే! మా భాష గురించి, ఈ మనుష్యులు సరయిన పరిశోధన ఎందుకు చేయరు? మమ్మల్ని గురించి ఎంతో కొంత రిసెర్చి జరిగింది. మా మీద ఎన్నో పుస్తకాలు, వ్యాసాలు, సామెతలు కూడా ఈ మనుష్యులు తయారుచేసారు.

లాయల్టీ ఆఫ్ ఎ డాగ్ అంటే స్వామిభక్తి విషయంలో మా జాతి గురించి మనుష్యులయిన వారెవరూ తక్కువ అంచనా వేయరు! కాని ఈ మనుష్యుల్లో స్వామిభక్తి అనేది లేనే లేదు. తన చుట్టూ వుండేవాళ్లను ఎప్పుడు, ఎలా రెండుకాళ్లు పట్టి గోతిలోకి లాగుదామా అనే ఆలోచిస్తుంటారు పాపం. మాలాంటి నిలకడ మనుష్యులకు లేదు. రెండుకాళ్లు పట్టి లాగినా మేము ఇంక రెండుకాళ్ల మీద నిలమడలేము. కానీ, రెండుకాళ్లు ఒకేసారి లాగితే 'ఢాం' అని కింద పడకుండా వుండడానికి మనుషులకు సాధ్యం కాదు కదా! మాకు మిత్రమూ లేక శత్రువూ అయిన పిల్లి ఎంత పైనించి కిందకు బడినా గూడా, తన నాలుగు కాళ్లతో సమానంగా పడడం వల్ల దానికి ఫ్రాక్చర్ కాదు. ఇలాంటి కొన్ని సర్కస్ పాఠాలు (ఫీట్స్) కరాటే, జూడో, కుంగ్‌ఫూ లాంటి విశేష వ్యాయామ పద్ధతులను ఈ మనుష్యులు నేర్చుకుంటే చాలా మంచిది.

''ఎవ్విరి డాగ్ హాజ్ హిజ్ డే'' (ప్రతి కుక్కకు మంచిరోజు వస్తుంది) మా రెడ్డిగారు ఎస్.పి.గా ఉండేటప్పుడు ''ఎవ్వెరి డి.ఐ.జి. హాజ్ హిజ్ డే'' అని తమాషాగా చెప్పేవారు. ఇప్పుడు వారే డి.ఐ.జి.గా పనిచేస్తున్నారు కాబట్టి, ఆ పాత మాటను కొంత మార్పుచేసి ''ఎవ్వెరి డి.జి. హాజ్ హిజ్ డే'' అని వాడేస్తున్నారు.

నన్ను, ఎవరైనా సరే కుక్క అనే సర్వనామంతో పిలువడంగాని, నా గురించి ఆ పదం వాడడం గాని నాకు ఇష్టం లేదు. రెడ్డిగారు నాకొక మంచి పేరు పెట్టాడు కదా! ఎవరైనా ప్రేమ పూర్వకంగా ''జిమ్మి'' అని పొడవుగా పిలిస్తే పరుగెత్తుకెళ్లి వాళ్ల చేయి నాకాలనిపిస్తుంది. దానిలో అనౌచిత్యం ఏమీ లేదు కదా! బ్రిటిషు రాణిగారి చేతిని, కొంతమంది వెళ్లి ముద్దుపెట్టడం నేను ఎప్పుడో టి.వీ.లో చూశాను. నేను ఎవరి చేతినైనా ముద్దుపెడితే నేను అతన్ని వాసన చూస్తున్నాననుకొని భయపడిపో

తాడు. అదే కొద్దిగా నేను నాకితే ఎక్కువమంది మనుష్యులకు నా మీద భయం తగ్గిపోయి నా కంఠాన్ని గాని, లేక నా చెవివెనుక దువ్వడం గాని, లేక నా మొత్తం శరీరాన్నే మసాజ్‌గానీ చేస్తారుగదా!

నాకు కావలసినవి అన్నీ నాకు దొరుకుతున్నాయి. రెడ్డిగారు నన్ను లాలించినట్లు తన స్వంత పిల్లల్ని కూడా ఎప్పుడూ లాలించలేదు. నేను దగ్గరకు పోవడం కూడా వారి సతీమణికి చాలా భయంగా వుంటుంది. కానీ, నన్ను కట్టివేసి వుంచిన సమయంలో మాత్రం నా దగ్గరకు వచ్చి, చాలా ప్రేమతో నన్ను పేరు పెట్టి పిలవడమేకాక, నా తిండి, స్నానం శుభ్రతల గురించి పనివాళ్లను ఎంతో శ్రద్ధతో ఆమె అడిగి తెలుసుకొనేవారు. వారి పిల్లలకైతే నేనంటే ఓహ్! ఎంత ప్రాణమో! వారు నా దగ్గర ఎంత సమయం గడుపుతారో మీకు తెలుసా! ఆ విధంగా, ఆ ఇంటిలో ఒక వి.వి.ఐ.పి. ఎవరైనా వున్నాడంటే, అది నేనే!

ఏదైనా ఒక రోజు ఉదయం ఇంట్లో పాలు తక్కువయినా నాకు మాత్రం ఏ లోపం వుండేది కాదు. ప్రతిరోజూ నా కోటా మాత్రం నాకు దొరుకుతూనే ఉంటుంది. అలాంటి రోజుల్లో పిల్లలకు ఇచ్చే ఒక్కొక్క గ్లాసు పాలు నిండుగా వాళ్లకు దొరకవు. దాన్ని గురించి వాళ్లకు ఎలాంటి కంప్లైంటు గాని గ్రీవెన్స్‌గాని లేదు. అటువంటప్పుడు ఆ ఇంటికి వచ్చే సందర్శకులకు, టీ, కాఫీ బదులుగా, నిమ్మరసం గాని, లేదా చల్లటి పానీయాలు గాని ఇస్తుంటారు. బందులు, సమ్మెలు ఇలాంటి వెధవ సందర్భాలలో బజారులో ఏ వస్తువూ దొరకనప్పుడు కూడా నా ''బీఫ్''కు (గోమాంసము) మాత్రం, ఇప్పటివరకు ఒక్కరోజు కూడా ఇబ్బంది కాలేదు. అలా సుఖంగా సమృద్ధిగా నేను బ్రతుకుతున్నాను.

అయితే, ఇప్పుడు నా వయస్సు ఒక సంవత్సరము దాటింది. కానీ రెడ్డిగారి కుటుంబ సభ్యులంతా నన్ను వాళ్ళింట్లో చిన్న బిడ్డలాగా చూసుకుంటున్నారు కానీ, ఒక సంవత్సరం ప్రాయంలో నాకు వివాహ యోగ్యత వచ్చినట్లు వాళ్ళు అర్థం చేసుకోవటం లేదు. పాపం, ఈ మానవులకు వివాహ ప్రాయం గురించి కూడా చట్టాలు వున్నాయట. అమ్మాయికి 18 సం.లు, అబ్బాయికి 21 సం.లు నిండకుండా, వివాహం చేయడం, చేసుకోవడం చట్టవిరుద్ధమట! ఆ ప్రాయం వఱకు మా జాతివారు బ్రతకరే! మాలో అయితే, 18, 21 సం.లలో 10, 15 తరాలే పుట్టుకొస్తాయి. నేను ఇదంతా చెప్పడం నాకు తొందరగా పెళ్లి కావాలని ఉద్దేశ్యంతో కాదు. నేను చెప్పే ''పాయింట్'' ఏమిటంటే ఈరోజుక్కూడా, ఈ ఇంటివారు నన్ను ఒక శిశువుగానే పరిగణించి, వారు తమ ప్రేమ, వాత్సల్యాధిక్యతలతో నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారనే. పోనీ అదలా ఉంచి, మాకు ఓటు హక్కు వచ్చే ప్రాయం మాట ఏమిటి? ఏ కుక్కకు కూడా అదయితే వద్దు. ఈ మనుషులకు దొరికిన తరవాత, వాళ్లకు కావాల్సిన ఒక ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి వాళ్లకు ఎప్పుడయినా సాధ్యమైందా? పాపం! ప్రజాస్వా

మ్యమంటే మా శునక స్వామ్యము కంటే హీనం అని వాళ్ళకు తెలియకపోయినా నాకు తెలిసిపోయింది.

నా పరిస్థితులు ఇంత బాగా వున్నా కూడా, నా మనసులో ఏదో అసంతృప్తి, ఏదో ఒక వెలితి ఉన్నట్టుగానే అనిపిస్తోంది. భగవంతుడు మాకు కావాల్సినవి అన్నీ స్వయంగా ప్రసాదించడు కదా! అన్నీ వున్న వాడికి సంతాన భాగ్యం లేనట్టు, ఈ లోకంలో సమస్త జీవరాసులకు, ఏదైన ఒక లోపాన్నీ ఒక అసౌఖ్యాన్నీ లేదా ఒక అసంతృప్తిని కల్పించడం అనేది దేవుడు తెలిసి చేసే పనే. కావలసినవి అన్నీ మాకూ ఉంటే దేవునితో ఎక్కడ మేము సమానమై పోతామో అని ఆయన భయం. పోనీ దాన్నికూడా తోసిపుచ్చినా నా అసంతృప్తికి మరో కారణం ఉంది. నాకు కావాల్సిన ఆ వస్తువు దొరికినా, దొరకకపోయినా, దానివల్లనా భౌతిక సుఖాలకు ఏలాంటి ఎక్కువ, తక్కువలు లేకపోయినా కూడా ఫలానిది కావాలి అని నా మనసులో వేళ్లూనుకొనిపోయిన అభిలాష ఒకటి ఉంది.

అది ఏమిటంటే... కాలేజి కుర్రవాడు అయిన ఈ యింటి అబ్బాయి వ్యాహ్యాళికి వెళ్ళేటప్పుడు, నన్నూ వెంటతీసుకెళ్లేవాడు. కాదు, నన్ను బయటకు తీసుకెళ్లడం కోసమే నావెంట వచ్చేవాడు. అలా వెళ్లేటప్పుడు, ఆ వీధిలో కొన్ని ఇళ్ల బయట గేటుముందు ''కుక్కలున్నాయి జాగ్రత్త'' అనే బోర్డులుండడం నేను గమనించాను. అలాంటిది కొన్ని బోర్డులలో మంచి శ్వానముఖం ఉన్న బోర్డును గమనించకుండా ఎలా వుంటాను? సామాన్యంగా గేటుకు ఒక వైపు వున్నా స్తంభంమీద గృహనాధుడి పేరు వుంటుంది. మరో స్తంభంపై ఇంటిపేరు పెడతారు. కానీ, భార్య డాక్టరైతే మాత్రం ఇంటి పేరుకు బదులుగా భార్య పేరు అక్కడ వుంటుంది. అక్కడ ఏముంటే నాకేమిటి? గేటును మధ్యభాగంలో, ''కొంచెం అటుగాని, ఇటుగాని'' ఆ ఇంటికి అభిమానాస్పదుడు ''శునకం'' గారి బోర్డు కూడా వుంటే, అందులోని గొప్పతనం వేరేగదా! అని తఱచుగా, నేను తలపోస్తుంటాను. ప్రక్క ఇళ్ళల్లో నా మిత్రులకు అలాంటి బోర్డులు వుండడం వల్ల, వాళ్లకు ఎంత యమ ధీమాగా వుంటుందో అని అనుకున్నప్పుడు నాకు కొంచెం అసూయ కూడా కలుగుతుంది.

ఆ బోర్డుకూడా వుంటే ఓహ్! ఎంత మంచిది! ఒక ప్రక్కన రెడ్డిగారి పేరు, వారి ఉద్యోగ నామం. దాన్ని చూడగానే వచ్చేవాళ్లలో సగం మందికి లోపలకు రావడానికి భయంగా వుంటుంది. మరో స్తంభంలో వుండేది ఇంటిపేరు. దానితో ఏం లాభం లేదు. గేటు మధ్యలో నా బోర్డుకూడా వుంటే ఎంత బాగుంటుంది? ఒక్క మనిషి కూడా గేటు దాటి లోపలికి రాలేడు.

ఆ బోర్డు వుంటే నాకు లాభమేమిటో చెప్తాను. అది వుంటే, మొరగటం అనే నా పని సగం తగ్గుతుంది. ఎవరైనా గేటు వఱకు వచ్చి ఆ బోర్డు చూశారంటే,

వెంటనే వెనక్కి వెళ్లిపోతారు. లేదా గేటుకు సరాసరి ముందు నిలబడకుండా, అటుగాని ఇటుగాని, నాకు కనబడకుండా నిలబడతారు. గేటు దగ్గరకు ఎవరైనా వచ్చి నిలబడి వుంటే, ఇంక చేయాల్సిన కార్యక్రమం నా డ్యూటీయే కదా! రాత్రీ, పగలు ఈ మనుష్యులు గేటు దగ్గర అటుఇటు తిరిగితే మొరిగి మొరిగి నా శరీరం (గొంతు) చెడిపోదా! ఈ మధ్యన ఏదో ఇంగ్లీషు సినిమా కంపెనీ వారు సింహం గొంతు చెడిపోతే, అది రోజూ "స్ట్రెప్సిల్స్" అనే గొంతువేదన సింహం మాత్రలు వాడుతున్నట్టు నేను 'టీవీ'లో చూశాను. అందుకే ఆ గతి నాకు పట్టకుండా ఇలాంటి బోర్డు పెట్టడం ఎంతో అవసరం. దానితో, నా మొరిగే పరిమాణంలో యాభైశాతం తగ్గిపోతుంది. ఏదైనా ఒకరాత్రి కొంచెం ఎక్కువ మొరగటం అవసరమై, మరో రోజు పగటిపూట కొంచెం విశ్రాంతి తీసుకుందామని అనుకున్నప్పుడు, అనవసర సందర్శకులు, లేక అటూ ఇటూ తిరిగే కుక్కలు, గేదెలు మొదలగునవి గేటు దగ్గరకొచ్చి తప్పకుండా కనీసం ఒక నిముషమైనా ఆగుతాయి. నాకైతే ఒక్కరోజు క్యాజువల్ లీవు కూడా దొరకదని మీకందరికీ తెలుసుగదా! పోలీసు వాళ్లంతా 24 గంటలు డ్యూటీ అని చెబుతారు. ఈ ఇంట్లో ఆర్డర్లీ వాళ్లు, గార్డువాళ్ల విషయం నేను చూస్తూనే వున్నాను. గార్డు డ్యూటీ అంటే రోజూ సుమారు 20 గంటలయినా తప్పకుండా నిద్రపోవడమే. రెడ్డిగారు పగలు ఇంట్లో లేనప్పుడు వాళ్లు కూర్చుని పేకాట ఆడుతారు. లేకపోతే కుంభకర్ణ సేవ చేస్తారు. రాత్రిలో రెడ్డిగారు నిద్రపోయిన తరవాత వాళ్లుకూడా నిద్రపోతారు. "సెంట్రీ" కూర్చుని నిద్రపోతాడు. మిగతా వాళ్లు పండుకొని నిద్రపో తారు. రాత్రి ఎప్పుడైనా నేను ఎక్కువగా మొరిగి గోల చేసినా గూడా ఆ కూర్చుని నిద్రపోతున్న 'సెంట్రీ'కి నిద్రాభంగం ఉండదు. మళ్లీ రెడ్డిగారే లేచి గార్డు రూములో వుండే గంట కొట్టినప్పుడే 'స్లీపింగ్' పార్టీలో కనీసం ఒకడైనా లేస్తాడు. అందుకే సరిగ్గా చెప్పాలంటే ఈ ఇంట్లో 24 గంటలు డ్యూటీ చేసేది నేనొక్కడినే. అందువల్ల సరయిన విశ్రాంతికి నిజానికి అర్హుణ్ణి నేను మాత్రమే.

నాకు ఏదో విధంగా ఉపశాంతి కలిగించడం ఈ ఇంటివాళ్ల బాధ్యత. ప్రేమ అయితే నాకు పుష్కలంగా దొరుకుతుంది. తిండి విషయమైతే చెప్పనే అక్కర్లేదు. ఇంట్లో పిల్లలకు ఏదైనా జబ్బు వచ్చినప్పుడు డాక్టరును పిలవకున్నా, నేను ఒకసారి తుమ్మితేనే పిలుస్తారు. అదంతా చాలా బాగానే వుంది. కాని, "వాట్ అబౌట్ మై నేమ్ ప్లేట్?"

ఈ కుటుంబంలో ఎవరికైనా నా అభీష్టం గుఱించి కొద్దిగానైనా తెలిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా నాకోరిక తీర్చేవారు.

రెడ్డిగారి అబ్బాయి తనతోపాటు నన్ను బయటకు తీసుకువెళ్ళేటప్పుడు, దారిలో వున్న ఇళ్ల గేటుమీద వున్న శునక బోర్డులు చూసి మొరిగేదాన్ని. అప్పుడు, ఆ ఇళ్ల కుక్కలతో నేను కొట్లాడబోతున్నాననుకొని అతను నన్ను బలంగా లాగి తీసుకెళ్లేవాడు.

అయ్యగారి అమ్మాయి నన్ను తీసుకెళ్లేటప్పుడు కూడా ఇదే కార్యక్రమం నేను పునరావృత్తం చేసేదాన్ని. దాని ఫలితం కూడా అలాగే పునరావృత్తం అయింది.

దానితో, మనసులో నేను ఏమనుకొన్నానంటే -- గేటు దాటి వచ్చే ఇద్దరు ముగ్గురిని -- నాకు బాగా తెలిసిన ఇద్దరు పోలీసు వాళ్లైనా కూడా ఫరవాలేదు -- నేను కరిస్తే? దానివల్ల అలాంటి బోర్డు వచ్చే అవకాశం ఉంది. కాని నా వివేక రాహిత్యానికి నాకు శిక్ష లభిస్తే? నాకు పిచ్చి పట్టిందని నన్నెక్కడయినా బంధించి వేస్తే లేక నన్ను కాల్చేస్తే? ఎవరు ఏమి చెప్పినాకూడా, పోలీసు వాళ్లను మాత్రం ఎక్కువ నమ్మకూడదు. నిన్నటివఱకు మిత్రుడుగా వున్న ఒక పోలీసువాడు, ఈరోజు శత్రువు కాకూడదని లేదు. ఒక పోలీసువాడు మాకు శత్రువు అవడంలో ఎంత ప్రమాదం వుందో, అంత ప్రమాదం ఒక శత్రువు పోలీసువాడు కావడంలో లేదు. దొంగ చేతికి తాళం చెవి ఇవ్వడం ఒక విధంగా మంచిదే అని అంటారు కదా!

అందుకని, కరుద్దామనే కార్యక్రమాన్ని మానుకొని, దేవుడిని ప్రార్థించడం మొదలు పెట్టాను. ఓ భగవంతుడా, ఇంటిలో ఎవరికయినా నా మనస్సు తెలిసేటట్టు చేయండి -- ఇంకా ఎక్కువ ఆలస్యం చేయకుండా నాకు ఆ బోర్డు ఇప్పించు -- పక్కింటి కుక్కలపై నాకున్న అసూయను తొలగించి, నన్ను నేను ప్రేమించినట్టుగానే, పక్కింటి వాళ్లను ప్రేమించడానికి గూడా నాకు మంచి బుద్ధిని ప్రసాదించు.

ఎక్కువ ఆలస్యం కాకుండానే నా ప్రార్థన ఫలించింది.

నిన్న అంటే ఆదివారం సాయంత్రం, రెడ్డిగారి కూతురు నన్ను బయటకు తీసుకొనివెళ్లేటప్పుడు, పక్కింటి కుక్క గేటుదగ్గర లేదని తెలుసుకొని, నేను ఆగేటుమీద వున్న కుక్క బోర్డును పట్టుకుని లాగాను. అనంతరం, వెనక్కు తిరిగి మా ఇంటివైపు పరుగెత్తి, గేటుమీద రెండు, మూడుసార్లు నా ముందుకాళ్లు పెట్టాను. నేను ఏం చేస్తున్నానో అని ఆ అమ్మాయి ఆశ్చర్యంతో చూసింది. మళ్లీ ఒకసారి, పక్కింటికి పరుగెత్తి, ఆ బోర్డును పట్టుకొని లాగి, తరువాత మాగేటు దగ్గరకు తిరిగివచ్చి, అలాంటి బోర్డు పెట్టాల్సిన స్థానం నేను చూపించాను. ఆ అమ్మాయికి నా ఉద్దేశ్యం అర్థమయిందనే అనుకున్నాను - నన్ను దగ్గరకు తీసుకొని ముద్దు పెట్టింతర్వాత నన్ను లాక్కుని రెడ్డిగారి సమక్షానికి తీసుకెళ్లింది

''డాడీ, డాడీ, ఈ జిమ్మీ జబ్బు ఏమిటో నా కర్థమయింది... పక్క ఇళ్లలోని కుక్కల్ని కరవడానకి కాదు అది గొడవ చేసేది; అక్కడవున్నట్టే 'బివేర్ ఆఫ్ డాగ్స్' అనే బోర్డు దీనికి కూడా కావాలట. ఈరోజు ఇది రెండుసార్లు అట్లా చూపించేసరికి నాకు బాగా అర్థమయింది.''

రెడ్డిగారు, వారి భార్య ఒకటే నవ్వు మొదలు పెట్టారు. కానీ, వారి కుమారుడు మాత్రం కొంచెం సేపు అలాగే నిలబడి ఆలోచించి, తర్వాత చెప్పాడు -

''డాడీ, చెల్లి చెప్పేది నిజమే. ఇంతవఅకు నేనూ ఆలోచించలేదు. దాని గొడవ చూసి నాకు ఆశ్చర్యం మాత్రమే వేసేది. డాడీ, ఏమైనా గాని, మనం ఒక బోర్డురాసి పెట్టిచూద్దాం. తరువాత 'వాకింగ్'కు వెళ్లేటప్పుడు, అది, ఆ గేటువైపు దూకుతుందో లేదో చూద్దాం.''

''సరే, మీ ఇష్టం. రేపే ఒక చిన్న బోర్డు వ్రాయించి పెడ్దాం, చాలా!''

ఆ తల్లిదండ్రులకు పిల్లల మాటపై కొద్దిగానైనా నమ్మకం కుదరలేదు సరికదా వారి నవ్వుకూడా ఆగలేదు.

అదంతా ఏమైనా ఈరోజు మధ్యాహ్నానికి నా బోర్డు గేటులో ఒక కీలకమైన స్థానంలో స్థాపించబడింది. సాయంత్రం కాలేజీ నుంచి ఇంటికి వచ్చిన పిల్లల్ని, నా సంతోషం వ్యక్తపరుస్తూ ప్రత్యేకంగా నాకాను. ఇంట్లోంచి ''కెమెరా'' తీసుకవచ్చి, నా బోర్డు దగ్గర నన్ను నిలబెట్టి వాళ్ళు నాకు ఒక ఫొటో తీశారు. మొదట్లో ఫొటో తీసేటప్పుడు నేను నవ్వుతూ నిలబడడం వాళ్లకు నచ్చినట్టు లేదు. అందుకే, రెండో ''స్నాప్'' కోసం నేను లోలోపల సంతోషంగా వున్నా బయటకు గంభీరంగా ఫోజు కొట్టాను.

ఈరోజు నుండీ నాకు పూర్తి సంతృప్తిగా వుంటుంది. ఈరోజు నుండీ నన్ను చూడకుండానే, నా మొరగటం వినకుండానే, గేటు దగ్గరకు వచ్చినవాళ్లు నా బోర్డు చూడగానే భయంతో పారిపోతారు. ఇక నాకు తలనొప్పి సగం తగ్గిపోతుంది. ఇక బయటకు వెళ్లేటప్పుడు, బోర్డులు చూసి మొరిగే అవసరం కూడా నాకు లేదు.

చిన్నమ్మాయికి నా వేడి, వేడి ముద్దులు. నన్ను ''సపోర్టు'' చేసిన అబ్బాయికి నా యొక్క పది నాకుళ్లు. రెడ్డిగారి పాదారవిందములకు వంద నమస్కారములు. అమ్మగారికి నా స్నేహపూర్వకమయిన వెయ్యి చూపులు. నా ప్రార్థనలు ఆలకించి నాపై కరుణ చూపించిన ఆ దేవదేవుడి కొఅకు నాలుగు ఈల ఊళలు వేస్తే? ఛీ, ఛీ, ఊళ వేసేది ఊరకుక్కలు. రెడ్డిగారికి కూడా అది నచ్చకపోవచ్చు.

థాంక్యూ మై లార్డ్ థ్యాంక్యూ